మెగా డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

శ్రీకాకుళం : మెగా డిఎస్‌సి (ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టులు) పరీక్షలకు సిద్ధమవుతున్న జిల్లాకు చెందిన బిసి, ఇడబ్ల్యుఎస్ (ఇబిసి), ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు బిసి స్టడీ సర్కిల్ ఉచిత ఆన్‌లైన్ శిక్షణను అందిస్తోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు మీడియంల్లో అందుబాటులో ఉండే ఈ శిక్షణకు టెట్‌లో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. టెట్ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, టెట్ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువపత్రాలు (రూ.రెండు లక్షల లోపు), రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల బిసి స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382975679, 9295653489 ఫోన్ నంబర్లను సంప్రదించగలరని సూచించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- ఏడు రాష్ట్రాల్లో 142 కేసుల్లో నిందితులు
- రూ.5,33,530 విలువైన బంగారు, వెండి ఆభరణాలు, వస్తువులు స్వాధీనం
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో మూడేళ్ల వ్యవధిలో 14 చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. నిందితులు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌కు చెందిన నూర్ హాసన్, ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌కు చెందిన ఇర్ఫాన్ అహ్మద్, అబ్దుల్ గఫూర్‌గా గుర్తించామన్నారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది మార్చి 14న పలాస కాశీబుగ్గ శివాజీనగర్‌లో నివాసముంటున్న పాడి చంద్రశేఖర్ తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లి తిరిగి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో మూడు కిలోల వెండి ఆభరణాలు, వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎఎస్‌పి (క్రైమ్) పి.శ్రీనివాసరావు నేతృత్వాన కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు, సిఐ సూర్యనారాయణ, సిసిఎస్ సిఐ చంద్రమౌళి, ఎస్ఐ మధుసూదనరావు, క్లూస్ ఎస్ఐ భరత్ బృందాలుగా ఏర్పడ్డారు. మొగిలిపాడు కూడలి వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేస్తుండగా లారీలో నిందితులు పట్టుబడ్డారు. నిందితులు ఛత్తీస్‌ఘడ్ నుంచి కందిపప్పును కాశీబుగ్గ ప్రాంతానికి తీసుకొచ్చి సరుకును దింపే సమయంలో రెక్కీ నిర్వహించి ఇళ్లలో చోరీకి పాల్పడడం అలవాటుగా మార్చుకున్నారు. నిందితుల్లో నూర్ హాసన్‌పై ఏడు రాష్ట్రాల్లో 140 కేసులు ఉన్నాయి. ఇప్పటికే 32 కేసుల్లో అరెస్టయి రాయ్‌పూర్ జైలులో శిక్ష అనుభవిస్తూ బెయిల్‌పై వచ్చాడు. జైల్లో ఉన్న సమయంలోనే ఇర్ఫాన్ అహ్మద్, గఫూర్‌తో స్నేహం కుదిరింది. వీరు శ్రీకాకుళం వచ్చి తరచూ చోరీలకు పాల్పడినట్లు గుర్తిచామని ఎస్‌పి తెలిపారు. జిల్లాలో 2023లో మందస, కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్లలో రెండు కేసులు నమోదు కాగా, 2024లో కాశీబుగ్గలో ఐదు, సోంపేటలో ఒకటి, ఇచ్ఛాపురంలో రెండు, వజ్రపుకొత్తూరులో ఒకటి, 2025లో ఇప్పటివరకు కాశీబుగ్గలో రెండు కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ కేసుల్లో రూ.12,93,614 విలువైన బంగారం, వెండి, నగదు చోరీకి గురైందని, నిందితుల నుంచి రూ.5,33,530 విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో చోరీకి గురైన బంగారం నకిలీదిగా గుర్తించినట్లు తెలిపారు. తొమ్మిది తులాల బంగారు నగలు పోయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారని, అందులో 1 గ్రామ్ గోల్డ్ మినహా మిగిలినదంతా రోల్డ్ గోల్డ్‌గా గుర్తించినట్లు తెలిపారు. పోలీసులను తప్పుదోవ పట్టించే రీతిలో తప్పుడు ఫిర్యాదులు చేయరాదన్నారు. సమావేశంలో ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు, కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు, స్పెషల్ బ్రాంచి సిఐ ఇమాన్యుయేల్ రాజు, కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ, సిసిఎస్ సిఐ చంద్రమౌళి, ఎస్ఐ మధుసూదనరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుబడిన చోరీ సొత్తు

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె

- ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించొద్దు
- మున్సిపల్ కార్యాలయాల వద్ద కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఆమదాలవలస, ఇచ్ఛాపురం

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు తాడి సంతోష్, సిఐటియు ఇచ్ఛాపురం మండల కన్వీనర్ రమేష్ కుమార్ పట్నాయక్ హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సిపల్ కార్యాలయాల ఎదుట కార్మికులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే చర్యలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పౌరుగు సేవల కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తుందని, ఉద్యోగాలు పర్మినెంట్ చేస్తుందని ఆశించి భంగపడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు అత్యవసర సేవల ద్వారా తమ ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని, వారి హక్కులను రక్షించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. పర్మినెంట్ కార్మికులకు రెండో శనివారం, జాతీయ సెలవులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికులకు జాతీయ సెలవులు వర్తింపజేయాలన్నారు. శానిటేషన్ పనులకు పుష్ కాట్స్, బిన్‌లు, ఇతర పనిముట్లు అందజేయాలన్నారు. ఇంజినీరింగ్ ఎన్ఎంఆర్ క్లాస్ డ్రైవర్లకు జిఒ నంబరు 36 ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆమదాలవలస మున్సిపాల్టీలో పనిచేస్తూ మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు కళ్యాణ్, సింహాచలం రెండు కాళ్లు కోల్పోయిన కల్లేపల్లి శ్రీను కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన కుటుంబానికి రూ.ఐదు లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆమదాలవలస మున్సిపల్ మేనేజర్ లక్ష్మీనారాయణ బిషోయ్‌కు, ఇచ్ఛాపురం మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ యూనియన్ నాయకులు కె.తారకేశ్వరరావు, ఎ.శ్రీనివాస్, కె.ఈశ్వరరావు, డి.రాజేష్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఇచ్ఛాపురం : మున్సిపల్ కమిషనర్ రమేష్‌కి వినతిపత్రం అందిస్తున్న రమేష్ కుమార్

పెండింగ్ సమస్యలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, పరిపాలనాపరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూ పరిపాలన, తాగునీటి సరఫరా, ఐసిడిఎస్, గ్రామ సచివాలయాల పనితీరు వంటి కీలక అంశాలపై సమీక్షించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల పరిశీలనను ప్రామాణికంగా డివిజన్ల స్థాయిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆక్రమణల క్రమబద్ధీకరణ, ఇళ్ల స్థలాల పున: పరిశీలన, ప్రాథమిక గ్రామాల పున: సర్వే, ప్రభుత్వ భూముల వివరాలు, నీటి పన్ను వసూళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, జిల్లా ప్రణాళికాధికారి, గ్రామీణ నీటిపారుదల అధికారుల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. పల్లె పండగ అభివృద్ధి కార్యక్రమాల్లో మెటీరియల్ కాంపోనెంట్ వినియోగాన్ని గ్రామస్థాయి ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్ల వద్దే పర్యవేక్షించాలన్నారు. పిఎం సూర్యఘర్ యోజన పథకంలో బ్యాంకులు, కాంట్రాక్టర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమగ్ర శిశు అభివృద్ధి కేంద్రాల్లో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో కొత్త విధానాలను అమలు చేయడంలో ఉద్యోగుల హాజరు, సర్వేలు ముఖ్యమన్నారు. పరిశుభ్రతపై, ప్రత్యేకించి ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రమేయం ఉన్న కమిటీల పనితీరు పర్యవేక్షించాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార స్థితిగతులు, పరిష్కరించిన ఫిర్యాదుల పరిశీలన, ఆంధ్రప్రదేశ్ సేవ, మీసేవ దరఖాస్తులపై సమీక్షించారు. సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డిపిఒ భారతి సౌజన్య, వ్యవసాయ శాఖ అధికారి కె.త్రినాథస్వామి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డ్వామా పీడీ సుధాకర్, జిల్లాలోని ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఇఒ తిరుమల చైతన్య

బడులు తెరిచిన నాటికే పాఠ్య పుస్తకాలు

జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య

ప్రజాశక్తి - టెక్కలి

వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలు తెరిచే నాటికే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య అన్నారు. స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వేసవి సెలవుల్లోనే పాఠ్యపుస్తకాలు, విద్యా కానుకలు, యూనిఫారాలు అన్నింటిని ఆయా పాఠశాలలకు అందిస్తామని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యా బోధనపై ఉపాధ్యాయులు దృష్టిసారించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే మిగులు ఉపాధ్యాయులను ఆయా పాఠశాలలకు సర్దుబాటు చేసినట్లు చెప్పారు. వేసవి సెలవుల్లోనే బదిలీల ప్రక్రియలూ పూర్తి చేస్తామన్నారు. కొత్తగా ఉపాధ్యాయుల నియామకం కోసం డిఎస్‌సి నోటిఫికేషన్ ఈ నెలాఖరు నాటికి ప్రభుత్వం విడుదల చేయనుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 2.45 లక్షలకు పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

గ్రామాల్లో ఉన్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవిధంగా ఉపాధ్యాయుల ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నామని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను తరలించే విధానానికి స్వస్తి పలికి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు వాహన సదుపాయం కల్పించనున్నామన్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేశామన్నారు. అంతకుముందు మండలంలోని పోలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలని ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యార్థుల చేరికలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారులు డి.తులసిరావురెడ్డి, డి.చిన్నారావు, మండల రిపోర్స్ సిబ్బంది ఉన్నారు.

నిత్యావసర వస్తువుల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలోని 14 మండల స్థాయి గోదాముల నుంచి చౌక ధరల దుకాణాలకు గ్రామ, వార్డు సచివాలయాలకు నిత్యావసర సరుకులు డోర్ డెలివరీ చేసేందుకు కాంట్రాక్టర్ల నియామకానికి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో దశ రవాణా నిమిత్తం నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కాంట్రాక్టు 2027 మార్చి 31వ తేదీ వరకు అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ఆసక్తి గల కాంట్రాక్టర్లు జిల్లా పౌరసరఫరాల మేనేజరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, శ్రీకాకుళం పేరున రూ.ఐదు వేల డిమాండ్ డ్రాఫ్ట్ చెల్లించాలని తెలిపారు. టెండర్ పూర్తి వివరాలను https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి చేసిన టెండరు దరఖాస్తులను ఈనెల 30వ తేదీ సాయంత్రం ఆరు గంటల్లో ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. టెక్నికల్ బిడ్‌ను ఈనెల 30వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు తెరుస్తారని, అర్హత సాధించిన వారి బిడ్‌ను మే ఒకటో తేదీ ఉదయం 11 గంటలకు తెరవనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7732098637 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

ఓటర్ల జాబితా తయారీకి సూచనలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలో ఓటర్ల జాబితా సవరణలో భాగంగా మార్పులు, చేర్పులపై సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష కోరారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో మరణించిన ఓటర్లు, వివాహమైన తర్వాత కొత్తగా వచ్చిన వారు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాల మార్పులు, చేర్పుల జాబితాలో ఉన్నాయన్నారు. వాటిని వార్డులు, గ్రామాల వారీగా గుర్తించి తొలగింపునకు చర్యలు చేపట్టాలని తహశీల్దార్లను ఆదేశించారు. ఎపిక్ కార్డుల ఆధారంగా 171 ఓట్లు రెండు చోట్ల నమోదై ఉన్నట్లు గుర్తించామని వాటిని తొలగించాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్లు ఎస్.గణపతిరావు, పద్మావతి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ జి.కె శ్రీనివాసరావు, మాదారపు వెంకటేష్ (టిడిపి), ఎ.శ్రీనివాసరావు (వైసిపి) కుమారి (కాంగ్రెస్), ఆర్.పురుషోత్తం (బిజెపి) తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మే పదో తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా కోర్టు భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పని భారం తగ్గించుకోవాలన్నారు. రాజీ పడదగ్గ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకుని కొత్త జీవితం ప్రారంభించడానికి ఇదో మార్గమన్నారు.

ఎక్కువ సంఖ్యలో మోటారు వాహన ప్రమాద కేసులను రాజీ చేయడం ద్వారా ప్రమాద బాధితులకు తక్షణము సహాయం అందే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసు రాజీ అయితే ఇరు పక్షాలకూ గెలుపే ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఒకటి, మూడు, నాలుగో అదనపు జిల్లా జడ్జిలు పి.భాస్కరరావు, సిహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, ఎస్.ఎం ఫణికుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆర్.సన్యాసినాయుడు, పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేంద్ర ప్రభుత్వ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జాతీయ ప్రధానమంత్రి రాష్ట్రీయ్ బాల్ పురస్కారాల కోసం ఐదు నుంచి 18 ఏళ్ల (జూలై 31, 2025)లోపు బాలల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్య సాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు తదితర వాటిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్న భారత సంతతికి చెందిన ఆసక్తి గల గల బాలలు ఈ ఏడాది జూలై 31 తేదీ లోపు http:/awards.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను పంపించాలని సూచించారు.

సమానత్వంతోనే సాధికారిత

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

సమానత్వంతోనే సాధికారిత సాధ్యమవుతుందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని అన్నారు. జాతీయ సామాజిక విజ్ఞాన పరిశోధన మండలి-దక్షిణ ప్రాంతీయ కేంద్రం హైదరాబాద్ సహకారంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగం, వర్శిటీ అంబేద్కర్ అధ్యయన కేంద్రం సంయుక్తంగా 'విస్మరించబడిన వర్గాలకు సాధికారిత - సామాజిక పని విలువలకు డా.అంబేద్కర్ సహకారం' అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సెమినార్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ జీవితాన్ని పూర్తిగా అధ్యయనం చేయడం ద్వారా సమాజ వాస్తవ పరిస్థితులు అవగాహన చేసుకోవడమే కాకుండా వాటి పరిష్కారంలో భాగస్వాములు కావచ్చన్నారు. వర్శిటీ రిజిస్ట్రార్ పి.సుజాత మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు, ఆలోచనల కోసం పాటుపడితే ప్రతిఒక్కరికీ విద్య, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ సాధికారిత సాధ్యమవుతుందన్నారు. మానవ హక్కుల ఫోరం ప్రధాన కార్యదర్శి వి.ఎస్ కృష్ణ, సోషల్ వర్క్ విభాగపు బిఒఎస్ ఛైర్మన్ ఆచార్య పి.అర్జున్, బెజ్జిపురం యూత్ క్లబ్ అధ్యక్షులు ప్రసాదరావు, సెమినార్ కన్వీనర్ యు.కావ్యజ్యోత్స్న, కో-కన్వీనర్లు డి.వనజ, కె.శ్యామల, స్కాలర్ జి.నవీన తదితరులు మాట్లాడారు.

అంబేద్కర్ దృక్పథంలో విభిన్న అంశాలు, అధ్యయనాలపై సెమినార్‌లో పరిశోధనా ప్రసంగాలు చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ముగింపు రోజు అంబేద్కర్ తాత్విక దక్పథం- సామాజిక న్యాయం, ఆధునిక సోషల్ వర్క్ రంగంలో అంబేద్కర్ సంబంధిత ఆలోచనలు, సుస్థిరతమైన సాధికారిత- అంబేద్కర్ సిద్ధాంతాలు మరియు సోషల్ వర్క్ విలువలు, సమ్మిళిత మరియు విభిన్న నివాసితులు, అంబేద్కర్ తాత్వికత ద్వారా సమాజాభివృద్ధి అనే అంశాలపై మూడు టెక్నికల్ సెషన్స్ నిర్వహించారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (విజయనగరం) సోషల్ వర్క్ విభాగం అధ్యాపకులు ఎం.నగేష్, తిలక్, మహారాష్ట్ర విద్యాపీఠ్(పూణే) సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రకాష్, ఎస్.యాదవ్, భారతి విద్యాపీఠ్ యూనివర్శిటీ (సోలాపూర్) సామాజిక విజ్ఞాన కేంద్రం సంచాలకులు కీర్తిరాజ్ తదితరులు మాట్లాడారు.

మాట్లాడుతున్న అంబేద్కర్ యూనివర్శిటీ విసి రజని

మరిన్ని వార్తల కోసం

www.prajasakti.com

epaper.prajasakti.com

మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 112/2021

Between:-
కెంబూరు అప్పలనాయుడు .....వాది
And:
గేదెల వాసుదేవరావు .....ప్రతివాది

పై నెంబర్ దావాలో వాది ప్రతివాది పైన ప్రోనోటు బాకి రాబట్టే నిమిత్తం దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో ప్రతివాది అయిన గేదెల వాసుదేవరావు గారు పొందూరు కోర్టులో **తేది 22-04-2025న ఉదయం 10.30 గంటలకు** స్వయంగా గాని, వకీలు ద్వారాగా గాని హాజరై అతనికి గల ఆక్షేపనలు తెలియజేయగలరు. అటులు కాని యెడల మీకు వ్యతిరేకముగా తీర్పు ఇవ్వడం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడమయినది.

(శ్రీ కోర్టు వారి ఉత్తరువులతో)

పొందూరు,
తేది: 15-04-2025

అడ్రస్:
గేదెల వాసుదేవరావు
S/o లక్ష్మన్నాయుడు,
గేదెలపేట గ్రామం
జి. సిగడాం మండలం,
శ్రీకాకుళం జిల్లా.

ఐ. శ్రీరాములునాయుడు
న్యాయవాది,
పొందూరు,
ఫోన్: 9441289946.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT AMADALAVALASA
O.S.NO.115/2024

Between:- **State Bank of India, Sarubujjili, Rep by its Branch Manager,** ....Plaintiff
And
1. Boddepalli Vinith Gowri,
2. M/s. Sri Sai Gowri Super market, Rep. by its Proprietor Boddepalli Vinith Gowri. .....Defendants

SUMMON

To,
1. Boddepalli Vinith Gowri, W/o. Ramakrishna, Proprietor, Sri Sai Gowri Super market, Door No.1-120, Main Street, Chintalabadavanja village, L.N. Peta Mandal, Srikakulam District, PIN No.532458.
2. M/s. Sri Sai Gowri Super market, Rep. by its Proprietor Boddepalli Vinith Gowri. W/o. Ramakrishna, Door No. 1-137, Main Road, Komanapalli village, Jalumuru Mandal, Srikakulam District, PIN No.532427.

Please take notice that the above suit is filed for recovery of an amount of Rs. 15,94,533/- from you and the suit is stands posted to **24-04-2025** for your appearance either in person or through an advocate **at 10-30 A.M.** Failing which the matter will be heard and decided ex-parte in your absence by the Honourable court.

BY ORDER OF THE HONOURABLE COURT

P.V. NARASIMHULU,
ADVOCATE, AMADALAVALASA
SKAKULAM DIST, CELL NO.9963230649.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT AMADALAVALASA
O.S.NO.116/2024

Between:- **State Bank of India, Sarubujjili, Rep by its Branch Manager,** .....Plaintiff
And:-
1. Boddepalli Ramakrishna,
2. M/s. Sri Sai Durga Super market, Rep. by its Proprietor Boddepalli Ramakrishna. ....Defendants

SUMMON

To,
1. Boddepalli Ramakrishna, S/o. Tavitinaidu, Proprietor, Sri Sai Durga Super market, Door No. 1-120, Main Street, Chintalabadavanja village, L.N. Peta Mandal, Srikakulam District.-5324 58.
2. M/s. Sri Sai Durga Super market, Rep. by its Proprietor Boddepalli Ramakrishna, S/o. Tavitinaidu, Door No. 1-42, Main Road, Beside RTC Bus Stand, Sarubujjili village & Mandal, Srikakulam District-532458.

Please take notice that the above suit is filed for recovery of an amount of Rs. 10,54,423/- from you and the suit is stands posted to **24-04-2025** for your appearance either in person or through an advocate at **10-30 A.M.** Failing which the matter will be heard and decided ex-parte in your absence by the Honourable court.

BY ORDER OF THE HONOURABLE COURT

P.V. NARASIMHULU,
ADVOCATE, AMADALAVALASA
SKAKULAM DIST, CELL NO.9963230649.

బహిరంగ ప్రకటన
మహారాజశ్రీ నరసన్నపేట జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టు నరసన్నపేట.
Crl. M.P. No.217 of 2025 in CC 358/2021
Date: 29/01/2025 అర్డర్ అనుసరించి

Between:-
వైశ్యరాజు శివ వెంకట సత్యన్నారాయణరాజు .....Complainant/ఫిర్యాది/వాది/పిటిషనర్
And:-
రెల్ల హరిశంకర నెహ్రూ ....ముద్దాయి/Respondent

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై నంబరు కేసులో ఫిర్యాదిదారు మీ పై అనగా ప్రతి వాదియైన రెల్ల హరి శంకర నెహ్రూ S/o వెంకటరావు, R/O డోర్ నెం.3-50, వెంకటేశ్వర కాలనీ, టెక్కలి టౌన్ & పోస్ట్ మండలం శ్రీకాకుళం జిల్లా వారిపై నరసన్నపేట కోర్టులో U/S 138 Of N ACT క్రింద కేసు వేసి సదరు కేసు లోని ప్రతివాది యైన మీరు నేటివరకు కోర్టు నోటీసులను తీసుకోనందున కోర్టు వారు క్రిమినల్ MP No.217/2025 In CC358/2021లో బహిరంగ ప్రకటన ద్వారా మీకు తెలియ చేయమని ఆదేశించియున్నారు. పై నెంబరు కేసు CC358/2021లో కోర్టు వారు మీ హాజరు నిమిత్తం తే.24-04-2025దికు వేసి యున్నారు. కావున ఇందుమూలముగా రెళ్ళ హరి శంకర నెహ్రూ అను మీకు తెలియజేయునది ఏమనగా తే.24-04-2025 దిన ఉదయం గ॥10-30ని॥లకు మీరు స్వయంగా గానీ/ వకీలు ద్వారాను గానీ గౌరవ మహారాజశ్రీ జుడిషియల్ ఫస్ట్ క్లాసు మేజిస్ట్రేట్ కోర్టు వారి నరసన్నపేటలో ఎదుట హాజరు కావలెనని ఈ ప్రకటన ద్వారా తెలియ జేయడమైనది. అందుకు తప్పిన పరోక్షంలో కోర్టు వారు తగు చర్యలు తీసుకొందువని తెలియజేయుచున్నాము.

జి.వి.వి.జి. నాయుడు
సెల్: 9440126453
వై.ఆర్. ప్రసాద్
సెల్: 9440955518
పిర్యాదు తరుపున న్యాయవాదులు, నరసన్నపేట,

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రభుత్వ బడిని కాపాడుకుందాం

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలనే తలంపుతో 'ప్రభుత్వ బడిని కాపాడుకుందాం' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు, జిల్లా కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనా తమపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా నమోదు సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు దవళ వైకుంఠరావు, పాలవలస ధర్మారావులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు కురమాన దాలయ్య, బాలక శంకరరావు, పి.గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు, వి.సింహాచలం, మారం కుమారస్వామి, బమ్మిడి అరుణకుమార్, విజయ్‌కుమార్, సివకుమార్ పాల్గొన్నారు.

వ్యాన్ తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సబ్సిడీ రుణాలను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పియుసి చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని లోలుగుకు చెందిన నవిరి పార్వతికి పిఎం మత్స్య సంపద యోచన కింద రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో రూ.14 లక్షలు ఐచర్ వ్యాన్‌ను రూ.7 లక్షల సబ్సిడీ రుణం కింది మంజూరైన వ్యాన్‌ను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దళితులకు వివిధ సబ్సిడీ రుణ పథకాలను మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఈ సబ్సిడీ రుణాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని మరి కొందరికి ఉపాధి కల్పించడంతో పాటు ఆదాయాన్ని అర్జించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బాహుదా వంతెనను నిర్మించాలి

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో కూలిన బాహుదా రోడ్డు వంతెన నిర్మాణానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఇటీవల కూలిన వంతెన దీనస్థితిని స్థానిక వైసిపి నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంతెన కూడలిన సమయంలో మాజీ సిఎం జగన్ రూ.20 కోట్లు నూతన బ్రిడ్జి నిర్మాణానికి మంజూరు చేశారని గుర్తు చేశారు. తాత్కాలిక, డైవర్షన్ రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. డైవర్షన్ రోడ్డు వైసిపి హయాంలో చేపట్టిందేనని అన్నారు. నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు టెండర్లు కూడా పిలిచామన్నారు. ఈ టెండర్ ప్రక్రియ పూర్తి కాకముందే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. పది నెలలు అవుతున్నా నూతన బ్రిడ్జి నిర్మాణంలో ఎటువంటి పనులు చేపట్టలేదన్నారు. వైసిపి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 కోట్లు కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కలెక్టర్ స్పందించి తక్షణమే నూతన వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈమె వెంట ఎంపిపి బోర పుష్ప, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాభాల స్వర్ణమణి, కారింగి మోహన రావు, సళ్ల దేవరాజు, బాకి లక్ష్మీనారాయణ, పత్తి అవినాష్, కాళ్ల మనోజ్, ధనలక్ష్మి, బిందు నీలాద్రి పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ఇచ్ఛాపురం : విన్యాసాలు చేస్తున్న సిబ్బంది

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి- రణస్థలం

అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా చాలా వరకు అగ్నిప్రమాదాలు నివారించవచ్చని రణస్థలం అగ్నిమాపక అధికారి పైలా అశోక్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక సూర్య స్కూల్, తహశీల్దార్, సర్కిల్ కార్యాలయాల వద్ద అగ్నిమపాక సిబ్బంది స్కూల్ సేఫ్టీ, హౌస్ హోల్డ్ సేఫ్టీనకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం రామాంజనేయ థియేటర్ సినిమా సిబ్బబదికి, ప్రజలకు తీసుకోవలసిన జాగ్రత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణకు ప్రజలను చైతన్యపరిచేలా ఏటా అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వహణ అధికారి జోహార్‌ఖాన్ ఆధ్వర్యాన స్కూల్ ఆవరణలో అగ్నిమాపక అధికారి కె.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షణలో సూర్యారావు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవగాహన కల్పించారు. అలాగే బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం సిబ్బంది అగ్నిమాపక వాహనంతో విన్యాసాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, ప్రధానోపాధ్యారాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యద్‌సుల్తానా, ట్రాన్స్‌ఫోర్ట్ మేనేజర్ అలీమ్‌ఖాన్, అగ్నిమాపక సిబ్బంది నీలచలం, కామరాజు, ఎన్.డి.ప్రసాద్, వై.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట కూడలి, కోటబొమ్మాళి మెయిన్ రోడ్డులో స్థానిక అగ్నిమాపక ఇన్‌ఛార్జి అధికారి పి.ఆర్.రెడ్డి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. సిబ్బంది చేసిన విన్యాసాలు చూసిన ప్రేక్షకులకు అకట్టుకున్నాయి. ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దుకాణదారులకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది కె.విశ్వనాథం, ఎం.ధనుంజయ పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ దంపతులు మంగళవారం సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్‌శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం స్వామివారి సేవల్లో పాల్గొన్న వారికి అనివేటి మండపంలో ఆలయ సీనియర్ సహాయకులు అట్టాడ శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని అందజేశారు.

దర్శించుకుంటున్న కలెక్టర్ దంపతులు

అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

మాట్లాడుతున్న పద్మావతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల అధికారి పద్మావతి అన్నారు. స్థానిక రోటరీ కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి బిఎల్‌ఒలతో, రాజకీయ పార్టీ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత కక్షలతో అనవసరంగా ఓటర్లు తొలగింపు చేస్తే సహించేది లేదన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే పోలింగ్ బూత్‌లో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులపై బూత్‌స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా మంది వలసలో ఉన్నారని, వారికి ఓటు హక్కు కల్పించాలని కోరారు. టిడిపి నుంచి పత్రి తవిటయ్య మాట్లాడుతూ ఓటర్లకు నివాసం ఉండే ప్రాంతాల్లో ఓటు హక్కు కల్పించాలన్నారు. వైసిపి ప్రతినిధి ఆర్.చిట్టిబాబు మాట్లాడుతూ కొంతమంది బిఎల్‌ఒ, బిఎల్‌ఎలకు తెలియకుండా ఓట్లు తొలగిస్తున్నారని అన్నారు. సమావేశంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట తహశీల్దార్లు వెంకటరావు, మురళీమోహనరావు, రమేష్, అప్పలస్వామి, ఎన్నికల డిటి శ్రీహరి పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ పరిధిలోని వెంగళరావు కాలనీ సమీపంలో అప్ లైన్ ట్రాక్‌పై మంగళవారం రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. జిఆర్‌పి ఎస్ఐ మధుసూదనరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బూర్జ మండలం పాలవలసకు చెందిన సురవరపు శ్రీనివాసరావు (42) వ్యక్తిగత పనులపై వెళ్తూ ట్రాక్ దాటుతున్నాడు. ఈ సమయంలో గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడికి భార్య భార్య భవాని, కుమారుడు చైతన్య, కుమార్తె స్పందన ఉన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు దుర్మరణం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని చిలకపాలెం సమీపంలో జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు మంగళవారం మృతి చెందారు. విజయనగరం జిల్లా రేగిడి ఆముదలవలస మండలం లక్ష్మీపురానికి చెందిన మూగ చిన్నలచ్చుయ్య (74) లావేరు మండలం బుడుమూరు సోమవారం సంతకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో బ్రిడ్జి కింద నిల్చొన్నాడు. ఆ సమయంలో అదే సర్వీస్ రోడ్‌లో వస్తున్న లారీ పాత జాతీయ రహదారి వైపు వెళ్తూ చిన్నలచ్చయ్యను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన గాయపడడంతో 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య సూరమ్మ, నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ సందీప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా పట్టివేత

కొత్తూరు : మండలంలోని మెట్టూరు బిట్టు-1కు చెందిన ఆసుపల్లి రాములు ఇంటి వద్ద నాటుసారాను విక్రయిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ తెలిపారు. నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో మంగళవారం దాడి చేశామని, ఈ దాడిలో ఐదు లీటర్ల నాటుసారా పట్టుకుని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రాములును అరెస్టు చేసి కేసు నమోదు చేశామని, నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని చెల్లాయివలస పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నిర్మలాదేవి అధ్యక్షతన విద్యార్థులతో, తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విద్య సామాన్యులకు దూరం చేస్తున్న ప్రస్తుత పాలకుల విధానాలు దోహదపడుతుందన్నారు. దీన్ని ఎదుర్కొని సామాన్యులకు విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో బి.రామారావు, బి జితేంద్ర, ఎం.మల్లేశ్వరావు, శ్రీహరిప్రసాద్, ఎస్.సాయిరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులు ఏకగ్రీవంగా ఆమోదిస్తూ... తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బలోపేతానికి సహకరిస్తామన్నారు.

పరీక్షల షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాల విద్యార్థుల సెమిస్టర్ విధానాలకు సంబంధించిన స్పెషల్ డ్రై పరీక్షల షెడ్యూలను యూనివర్సిటీ ఎగ్జామినేషన్ డాక్టర్ జి.పద్మారావు మంగళవారం విడుదల చేశారు. సాంకేతిక కారణాల వల్ల ఇప్పటికే వాయిదా పడిన ఒకటి, మూడు, ఐదు సెమిస్టర్లకు సంబంధించిన స్పెషల్ డ్రైవ్ పరీక్షలు ఈ నెల 17 నుంచి వచ్చేనెల 17 వరకు కొనసాగుతాయన్నారు.

కురుస్తున్న వర్షం

పాతపట్నంలో వర్షం

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలో పలుచోట్ల మంగళవారం మధ్యాహ్నం నుంచి ఉరుములతో, మెరుపులుతో జోరుగా వర్షం కురుస్తుంది. ఉదయం నుంచి ఎండ తీవ్రతగా ఉంది. మధ్యాహ్నం సమయంలో చల్లని గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షంతో ఇటుకుల తయారీదారులు కాస్త ఇబ్బంది పడ్డారు. వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులకు ఈ వర్షం మేలు చేసిందని వాపోయారు. ఏప్రిల్ నెల ఎండల సమయంలో ఈ అకాల వర్షంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందుతున్నారు. ఉమురులు, మెరుపులతో పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని 21వ వార్డు పరిధిలోని కుద్దిరాంలో మంగళవారం సంభవించిన అగ్నిప్రమాదంలో సాధు చిరంజీవిరావుకు చెందిన గడ్డి వామి దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక ఎస్ఐ కె.అప్పారావు తన సిబ్బందితో శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 వేలు వరకు నష్టం సంభవించింది. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది జి.వెంకటరమణ, చక్రధరరావు, సురేష్‌బాబు, ఎం.ఉపేంద్ర పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

విద్యకు ప్రాధాన్యం

ప్రజాశక్తి : కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుందని, విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని కత్తిరివానిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యాశాఖాధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో విద్యా వ్యవస్థ అమలుపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ విద్యాతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ఆశయంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. స్కూల్ మెర్జి, మోడల్ స్కూల్ తదితర అంశాలపై మాట్లాడి విద్యాశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు శ్రీనివాస్ నాయక్, లింగరాజు, శాంతారావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన

ప్రజాశక్తి- రణస్థలం

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన, ఉత్తమైన బోధన ఉంటుందని, పిల్లలను ప్రభుత్వం పాఠశాలల్లో చేర్పించాలని సర్పంచ్ జక్కంపూడి అచ్చిరాజు, ఎంఇఒ బి.లావణ్య, హెచ్ఎం బి.సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని మరువాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 1, 2 తరగతుల ప్రవేశాలకు మంగళవారం ఇంటింటికీ వెళ్లి పిల్లల వివరాలు సేకరించారు. అంగన్వాడీ విద్యను పూర్తి చేసుకున్న తర్వాత 1, 2 తరగతులకు దూరప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా అన్ని వసతులతో మరువాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిల్లలు తల్లి దండ్రులకు సూచించారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో తిరిగి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండని, ఇతర ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సంతకాలు తీసుకున్నారు.

రణస్థలం : అవగాహన కల్పిస్తున్న సర్పంచ్, ఎంఇఒ

ఇచ్ఛాపురం : ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఇఒ కూరమాన అప్పారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని ముచ్చింద్రలో పర్యటించి చైతన్యపరిచారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ ప్రభుత్వ బడుల ఔన్నత్యాన్ని వివరించి విద్యార్థులను చేర్పించాలన్నారు. అలాగే ధర్మపురంలో నిర్వహించిన ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో పాల్గొని విద్యార్థులను బడిలో చేర్పించారు.

ఎంపికైన విద్యార్థులు

11 మంది ఎంపిక

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 2025లో బిటెక్ ఇసిఇ, సిఎస్ఇ, ఐటి, సిఎస్ఎం, ఈఈఈ కోర్సులు పూర్తిచేసిన 11 మంది విద్యార్థులు హైదరాబార్ కేంద్రంగా ఉన్న పీపుల్ టెక్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో అభ్యర్థులకు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడతగా ఏడుగురు బిటెక్ మెకానికల్ విద్యార్థులు ఎంపికగా, రెండోసారి తక్కిన బ్రాంచ్‌ల విద్యార్థులు 11 మంది ఎంపికయ్యారని అన్నారు. వార్షిక వేతనంగా ఒక్కొక్కరికి రూ.3 లక్షల మేర చెల్లిస్తుందన్నారు. వీరికి డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ ఒడిలు, టిపిఒ డాక్టర్ ఎం.వి.వి.ఎస్ కుమార్ విద్యార్థులను అభినందించారు.

కిడ్నీ బాధితునికి అండ

కవిటి: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని కొత్తపుట్టుగకు చెందిన యువకుడు నర్తు నేతాజీకి భైరిపురం గ్రామస్తులు అండగా నిలిచారు. నిరుపేద కుటుంబానికి చెందిన నేతాజీకి తండ్రి చిన్నతనంలోనే చనిపోతే తల్లి మీనమ్మ అన్నీ తానేఅయి పెంచింది. చివరికి తనను చూసుకోవాల్సిన పరిస్థితిలో కొడుకు కిడ్నీ వ్యాధికి గురవ్వడంతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. ఇక ఆలస్యం చేయకుండా తన బిడ్డ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తన కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. ఐతే ఆపరేషన్‌కు రూ.10 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఒక్క సారిగా కుప్పకూలిపోయింది. దాతలు సహకరించి తన బిడ్డ ప్రాణాలు కాపాడాలని అందరినీ వేడుకుంది. ఈ విషయం తెలుసుకున్న భైరిపురం గ్రామస్తులు కేవలం మూడు రోజుల్లోనే రూ.67,600లు పోగేశారు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన కొందరు యువకులు కొత్తపుట్టుగ వెళ్లి శివాజీకి ఈ మొత్తాన్ని అందజేశారు. అంతేకాకుండా కొడుకు ప్రాణం కోసం తల్లడిల్లిపోతున్న ఆ తల్లికి దాతలు అండగా నిలబడాలని కోరారు.

నగదు అందిస్తున్న భైరిపురం గ్రామస్తులు

సిహెచ్‌సిల్లో యంత్ర పరికరాలు

కోటబొమ్మాళి: కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లలో రాయితీపై అందించిన వ్యవసాయ యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదికన రైతులు వినియోగించుకోవాలని టెక్కలి ఎడిఎ బి.వి.తిరుమలరావు అన్నారు. మండలంలోని రేగులపాడు సచివాలయం పరిధిలోని కమ్యూనిటీ హైరింగ్ సెంటర్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో అద్దెకు కావాల్సిన పరికరాల వివరాలను నమోదు చేసుకుంటే వాటిని రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రస్తుతం వేసవి దుక్కులకు రైతులు ఈ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ ఎస్.గోవిందరావు, విఎఎ కె. భవాని, ఎంపిటిసి పట్ట సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : మండలంలో వివిధ గ్రామాలకు చెందిన రైతు సౌలభ్యం గుచించి ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎఒ బొడ్డేపల్లి పద్మనాభం తెలిపారు. మండలంలోని కొండవలస, రొట్టవలస, కొత్తకోట, చిగురువలస రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సాగు యంత్ర పరికరాలను రైతులు అద్దె ప్రాతిపదికన ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన గ్రూప్ సభ్యులు తమ వ్యవసాయ అవసరాలకు యంత్రాలను వాడుకుంటూ రైతులకూ తక్కువ అద్దెకు సరఫరా చేస్తూ సేవలందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో విస్తరణ అధికారులు టి.రాము ఎస్.అశోక్, వ్యవసాయ సహాయకులు ప్రసాద్, భగత్‌కుమార్, వెంకటలక్ష్మి, బెనర్జీ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : యంత్ర పరికరాలతో ఎఒ పద్మనాభం

సోంపేట మండలంలోని రైతుల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక యంత్ర సేవా కేంద్రాలను వ్యవసాయ శాఖ ఎడిఎ జగన్మోహనరావు, ఎఒ నరసింహమూర్తి తనిఖీ చేశారు. జగతికేశ్వరం, ఎం.జి.పురం, సుంకిడి, మా కన్నపురం, పాలవలస గ్రామాల్లోని సేవా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఇచ్ఛాపురం : మండలంలోని తెలుకుంచి, బాలకృష్ణాపురం, లోడపుట్టి, బెల్లుపాడ్, కీర్తిపురం, కొల్లిగాం, బిర్లాంగి, రక్తకన్న, కేదారిపురం గ్రామాల్లోని రాయితీతో ఏర్పాటు చేసినా కస్టమ్ హైరింగ్ సెంటర్స్‌లోని పరికరాలను ఎఒ టి.భార్గవి తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మల్లేశ్వరరావు, ప్రవీణ్, హరిత, దీక్షిత్, వెంకటేష్, భవాని, నిర్మల పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యా సంవత్సరం ముగింపులో భాగంగా నిర్వహించిన వార్షిక పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 7న ప్రారంభమైన పరీక్షలు వారం రోజుల పాటు నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు నిర్వహించిన ఈ వార్షిక పరీక్షలు ముగింపులో భాగంగా ఒఎంఆర్ షీటు విధానాన్ని అనుసరించారు. 9వ తరగతి విద్యార్థులకు మాత్రం సైన్స్ పరీక్ష రెండు రోజుల పాటు నిర్వహించారు. వార్షిక పరీక్షల్లో విద్యార్థులు రాసిన ఒఎంఆర్ షీట్లను విద్యాశాఖాధికారులకు అందజేశారు. విద్యార్థులు రాసిన జవాబుపత్రాలను మూల్యాంకనం చేపట్టి మార్కులను గ్రేడుల వారీగా విభజించి ఫలితాలను విద్యాసంవత్సరం ముగింపు నాటికే అందజేయాలని ఉన్నతస్థాయి విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇందులోభాగంగా ప్రభుత్వం అందించిన హోలీస్టిక్ ప్రగతిపత్రాలు పూర్తిచేసి విద్యార్థులకు అందించి ముగింపులోనే మరలా పాఠశాలల్లో వాటిని భద్రపరచాలి. మరొకొద్ది రోజుల్లో పాఠశాలలకు వేసవి సెలవులు మంజూరు చేయనున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు ఈ ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

మాట్లాడుతున్న తులసీవరప్రసాదరావు

టైలరింగ్ శిక్షణా కేంద్రం మంజూరు

ప్రజాశక్తి- కొత్తూరు

మండల కేంద్రానికి టైలరింగ్ శిక్షణా కేంద్రం మంజూరైందని వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ప్రత్యేక బాలికల వసతిగృహంలో మంగళవారం మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెజిబివిలో రిజిస్టర్ ఏర్పాటు చేసి మహిళల పేర్లు నమోదు చేస్తున్నామని అన్నారు. ఈ మహిళా టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని త్వరలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు, టిడిపి నాయకులు దారపు రామకృష్ణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఎంఇఒ ఎల్.వి.ప్రతాప్ సూచించారు. పోషకాహారం పక్షోత్సవం సందర్భంగా మండలంలోని సీతన్నపేట అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఒ హైమావతి, ఎసిడిపిఒ రూపలత, సూపర్‌వైజర్ సత్యప్రియ, రూప తదితరులు పాల్గొన్నారు.

2047 విజన్ లక్ష్యం

హౌసింగ్ పీడీ నగేష్

పలాస : ప్రభుత్వం స్వర్ణాంధ్రలో బాగంగా 2047 విజన్ లక్ష్యాన్ని చేధించేందుకు కృషి చేసి పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని జిల్లా హౌసింగ్ పీడీ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి నగేష్ అన్నారు. ఈ సందర్భంగా పలు కార్యాలయాలను ఎంపిడిఒ వసంతకుమార్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు పూర్తిస్థాయిలో సర్వే చేస్తున్నామని చెప్పారు. సర్వే చేసేందుకు పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలు నుంచి మహిళా పోలీసులు, విలేజ్ సర్వర్‌ను ఐదుగురు సభ్యులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. త్వరలో సర్వేకు సంబంధించిన పూర్తి స్థాయిలో కంప్యూటర్లు, ఇతర వస్తువులు పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గ కన్వీనర్‌గా ఎంపిడిఒ ఉంటారని చెప్పారు. ఈ ప్రాంతంలో తలసరి ఆదాయం, అసమానతలు, అభివృద్ధి చేసేందుకు ఎటువంటి పరిస్థితులు ఉన్నాయో వాటిపై అధ్యయనం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న పీడీ నగేష్

ఎమ్మెల్యేను కలిసిన హౌసింగ్ పీడీ

పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో హౌసింగ్ పీడీ, నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి నగేష్ ఎమ్మెల్యే గౌతు శిరీషను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస నియోజకవర్గానికి ఎన్నికల ప్రత్యేక అధికారిగా నియమించిందని, అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు. ఆయనతో పాటు ఎంపిడిఒ వసంతకుమార్ ఉన్నారు.

ఎస్ఎస్ఎస్‌తో 90 శాతం ఆడదూడల జననం

ఎపి పశుగణాభివృద్ధి సంస్థ సిఇఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పొందూరు

లింగనిర్ధారిత వీర్యం (సెక్స్ సార్టెడ్ సెమన్)తో కృత్రిమ గర్భోత్పత్తి విధానంతో 90 శాతం ఆడదూడలు పుడతాయని ఎపి పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తోలాపిలో లింగనిర్ధారిత వీర్యం ద్వారా జన్మించిన దూడలను మంగళవారం పరిశీలించారు. ఈ విధానం వల్ల ఆడదూడలు పుడుతుతండడంతో రైతులు ఆర్థికంగా ఎదుగుదల అవుతుందని అన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం ఈ విధానం మరింత ప్రోత్సహిస్తుందన్నారు. పేరుగాంచిన దేశీయ జాతుల, విదేశీ జాతుల ఆవులవీర్యాన్ని పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాడి రైతులకు మేలుచేసేందుకు ఈ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ వీర్యం ఖరీదు రూ.1300 ఆయినా ప్రభుత్వం రూ.800 సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. ఈయనతోపాటు శ్రీకాకుళం డివిజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామ్మోహనరావు, ఇఒడిఎల్ఎ డాక్టర్ సత్యప్రకాష్, విజయనగరం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దామోదరరావు, పొందూరు ఏడీ డాక్టర్ డిఎస్ఎస్ బాలకృష్ణ, వైద్యులు పద్మావతి, శ్రీనివాసరావు ఉన్నారు.

దూడను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

శ్రీకాకుళం : ఇంటర్ తప్పిన విద్యార్థులకు జిడిఎ, ఐసియు, ఒటి అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు బిఎస్సి, డిప్లొమా పారామెడికల్, నర్సింగ్, బిపిటి కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ పాసైన విద్యార్థులకు పిజి కోర్సులను అందిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి గలవారు 9121999654 సెల్ నంబరుకు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. రాగోలు వద్ద గల జెమ్స్ క్యాంపస్‌లోని మెడ్‌స్కిల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

వినతిపత్రం అందజేస్తున్న ఆనందరావు

కాలువ పనులకు చర్యలు తీసుకోవాలి

కొత్తూరు: స్థానిక సాగునీటి కాలువ పనులకు చర్యలు తీసుకోవాలని స్థానిక సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు లోతుగెడ్డ ఆనందరావు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణం భూమికి స్థానిక అడ్డం కాలువ ఆధారమని అన్నారు. ఈ కాలువలో స్థానికులు పడవేసిన చెత్తాచెదారంతో పూడిక పేరుకుపవడంతో సాగునీరు అందడం లేదని వివరించారు. దీంతో రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సాగునీటి పారుదల అధికారులు కనీసం స్పందన లేదని అన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

పాతపట్నం : అంగన్వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలో సీడి-2 అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పంపిణీ చేసే ఆహార వివరాలలను రికార్డుల్లో ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని కార్యకర్తకు సూచించారు. ఇచ్చే ఆహారం వారు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు చిన్నచిన్న కథలు, సూక్తులు చెప్పి ఎక్కువ మంది కేంద్రాలకు హాజరయ్యేటట్లు చూసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ప్రతి ఒక్క విషయాలను కచ్చితంగా ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు.

ఎండలో వెళ్తున్న విద్యార్థులు

చదువు కోసం తప్పదు మరి...

టెక్కలి : చదువుకోవాలనే తపన ఉన్నవారు ఎంతటి శ్రమకైనా ఓడార్చాలి. అప్పుడే విజయాన్ని అందుకుంటాడనే వాస్తవాన్ని వీరు చిన్నతనం నుంచే ఔపోసన పడుతున్నారు. ప్రస్తుతం ఒంటి పూట బడులు నిర్వహిస్తున్న ఈ సమయంలో దూరప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇదిగో ఇలా ఆటోలో వెనుకబాగాన కూర్చుని ఎండ వేడిమికి తట్టుకునేందుకు దుప్పటిను గొడుగులుగా ఉపయోగించుకుని వెళ్తున్న ఈ చిత్రం పలువురుని ఆలోచింపజేస్తుంది. టెక్కలి పట్టణం నుంచి దూర ప్రాంతానికి విద్యార్థులు ఎండలో వెళ్తున్న ఈ చిత్రం.

తాగునీటి ప్రాజెక్టు పనులు పరిశీలన

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అక్కుపల్లి కూడలి నుంచి ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వరకు ఓవర్ హెడ్ ట్యాంకుల వరకు చేపడుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు మంగళవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను, కాంట్రాక్టర్లను సూచించారు.

జగన్‌పై కేసు నమోదు చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష, రామ్

తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

పలాస : శాంతిభద్రతలను పరిరక్షించే పోలీసులను మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గుడ్డలు ఊడదీసి కొడతామని చెప్పడాన్ని బట్టి ఆయన తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని, ఆయనపై కేసులు నమోదు చేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను గాజువాక పోలీస్‌స్టేషన్‌లో జగన్‌పై ఫిర్యాదు చేశానని, రసీదు కూడా ఇచ్చారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అక్రమాలు అన్ని ఇన్ని కావని విమర్శించారు. పలాస, శ్రీకాకుళం ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ పరిపాలనలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకెళ్తున్నారని అన్నారు. ఈ నెల 28న విశాఖలోని హోటల్ దసపల్లాలో జన్మదిన వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి జన్మదిన వేడుకల విజయవంతంపై పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ కోనేరును అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి- పలాస

స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలోని ముత్యాలమ్మ కోనేరును అభివృద్ధి చేయాలని పలాస-కాశీబుగ్గ వాకర్స్ క్లబ్ సభ్యులు కోరారు. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పలాస-కాశీబుగ్గ ప్రాంతాలకు చెందిన ఎంతో మంది రోజూ వాకింగ్ చేస్తున్నారని, పార్కు పాడవ్వడంతో చిన్నారులు ఆటలు ఆడేందుకు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసి ముత్యాలమ్మ కోనేరు, పార్కును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పండిట్ రాజేంద్ర, బోయిన సత్యానంద్, దడియాల నరసింహులు, లండ నాగరాజు, రాముపాత్రో, బండారు బుజ్జి, బోనల భైరాగి, శిష్టు వసంతు, వెంగళ సూర్యప్రకాష్, సిహెచ్.వాసు, బొంపల్లి అప్పారావు, బెల్లాల శంకరరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న వాకర్స్

వినతిపత్రం అందజేస్తున్న తిరుపతిరావు

ఉద్యోగోన్నతులు కల్పించాలి

టెక్కలి : గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సంక్షేమ విద్యా సహాయకులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఈగల తిరుపతిరావు కోరారు. ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తమ శాఖకు చెందిన ఉద్యోగోన్నతుల ఫైల్ పెండింగ్‌లో ఉందన్నారు. దీనిపై కేంద్రమంత్రి స్పందించి ఈ విషయాన్ని సోషల్ వెల్ఫేర్ మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ చూపుతామని మాటిచ్చినట్లు తిరుపతిరావు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వజ్జ నరసయ్య, సుధ, నవీన్, శేఖర్ ఉన్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌కు మార్గం సుగమం

పలాస : పలాసలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు మార్గం సుగమమైందని ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మురళీమోహన్ అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో చోటుచేసుకున్న అవరోధాలను ఎమ్మెల్యే కృషి ఫలితంగా అధిగమించినట్లు ఆమెను కొనియాడారు. రామకృష్ణాపురం సమీపంలో 60.84 ఎకరాల్లో ఏర్పాటుకానున్న ఈ ఇండస్ట్రియల్ కారిడార్‌లో పరిశ్రమల ఏర్పాటుకు త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించనున్నట్లు ఆమెకు వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆ సంస్థ డీటీ సూర్యనారాయణ, బిల్ కలెక్టర్ తేజేశ్వరరావు ఉన్నారు.

ఎమ్మెల్యేకు వివరిస్తున్న మురళీమోహన్

ప్రథమ చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో జూనియర్ రెడ్‌క్రాస్ విభాగాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, ప్రిన్సిపాల్ ప్రభావతి వాలంటీర్లకు ప్రథమ చికిత్స, సిపిఆర్‌పై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం సిబ్బంది గొలివి రమణ అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స ఎంతో అవసరమన్నారు. ప్రధానంగా సిపిఆర్, రికవరీ, యాంటీషాక్, ఎలక్ట్రికల్ షాక్, పాముకాటు, గుండె జబ్బు తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ స్కూల్ జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ పి.రామకృష్ణ, రమాదేవి, ఉమాశంకర్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీకి నివాళి

ప్రజాశక్తి- పలాస

పలాస పరిసర ప్రాంతాల్లో ఎంతో మంది పేద ప్రజలకు వైద్యసేవలు అందించిన మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కణితి విశ్వనాథం రెండో వర్ధంతి వేడుకలను లయన్స్ క్లబ్ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పైల వెంకటరావు (చిట్టిబాబు), ఎంపిపి ప్రతినిధి ఉంగా సాయికృష్ణ, పలాస-కాశీబుగ్గ పట్టణ వైసిపి అధ్యక్షులు శిష్టు గోపి, వైసిపి మండల అధ్యక్షుడు దువ్వాడ రవికుమార్, నియోజకవర్గం ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు, తలగాన కిషోర్, నెయ్యల శివ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రతి ఎకరానికీ సాగునీరు

ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: రానున్న ఖరీఫ్ నాటికి వంశధార ఆయకట్టు శివారులోని ప్రతి ఎకరానికీ సాగునీరు అందించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వంశధార మేజర్ ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుడి ప్రధాన కాలువ ఆధునికీకరణ పనులకు రూ.1.75 కోట్లు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మరమ్మతుల పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. కాలువలో గండ్లను పూడ్చివేయడం, రక్షణ గోడలను నిర్మించడం, పూడికను తీసివేయడం చేపట్టాలన్నారు. సమావేశంలో ఇఇ ఎం.వి.రమణ, డిఇ సురేష్‌కుమార్, జెఇలు శ్రీనివాస్, సోమేష్ పాల్గొన్నారు.

జీవనోపాధుల మెరుగుకు చర్యలు

మందస: మహిళా సంఘాల జీవనోపాధుల మెరుగుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఐటిడిఎ వెలుగు ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని సరియాపల్లి పంచాయతీ బంజీరుజగన్నాథపురంలో సంఘాల సభ్యుల క్రెడిట్ ప్లాన్ తయారీని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025-26వ ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రుణం నుంచి కనీసం 70 శాతం ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు మీనాక్షి, ముఖలింగం, విఒఎ రేవతి, భీమారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పాతపట్నం : ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యం బాగుంటుందని ఎంఎంటిఎల్ సువర్ణ రాజు అన్నారు. మండలంలోని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, మహిళా సంఘాలు, రైతులు మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాల సాగు, ఆరోగ్య పోషణపై అవగాహన కల్పించారు. ఈ నవధాన్యాలు సాగువల్ల నేల, మనుషులు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఆర్‌పి రాజేశ్వరి, హెచ్‌ఎన్‌ఎఫ్‌ఎఫ్ రేణుక, కమ్యూనికేషన్ శ్రావ్య, ఎంటి సంజీవరావు పాల్గొన్నారు.

గురునాథ్‌కు గుర్తింపు

టెక్కలి : జిల్లా యాదవ సంఘం నాయకులు గురునాథ్ యాదవ్‌కు సముచిత స్థానం లభించింది. జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా టెక్కలికి చెందిన గురునాత్‌ను యాదవ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర యాదవ సంఘం సమావేశంలో ఈయనను ఎన్నుకున్నట్లు లాకా వెంగలరావు ప్రకటించారు. అనంతరం నియామకపత్రాన్ని అందజేశారు. వైసిపి నాయకునిగా, యాదవ సంఘం నాయకునిగా ఉన్న గురునాథ్ యాదవ్‌కి సముచిత స్థానం లభించడంపై పలువురు అభినందించారు.

కాలువ నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న అప్పలనాయుడు

ఆమదాలవలస : మండలంలోని కొర్లకోట కొత్త కాలనీలో రూ.26 లక్షలతో మురుగు కాలువ నిర్మాణానికి సర్పంచ్ ప్రతినిధి సనపల అప్పలనాయుడు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త కాలనీలో గడచిన కొన్నేళ్లుగా మురుగునీరు బయటకుపోకుండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఈ సమస్యను ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఉపాధి హామీ కాంపోనెంట్ నిధుల నుంచి రూ.26 లక్షలు మంజూరుకు కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సువ్వారి కృష్ణారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.